క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

భద్రాచలంటౌన్/మణుగూరురూరల్: భద్రాచలం, మణుగూరు ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్లు తిరుపతి, కె.శ్యాంసుందర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. భద్రాచలం డిపో పరిధిలోని ప్రయాణికులు 99592 25960 నంబర్‌కు, మణుగూరు డిపో పరిధి ప్రయాణికులు 7382858121 నంబర్‌కు మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫోన్ చేసి బస్సుల రాకపోకలు, అదనపు ట్రిప్పులు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చని వెల్లడించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఎకనమిక్స్, హిస్టరీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఆయా పోస్టులకు సెప్టెంబర్ 6న ఇంటర్వ్యూ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 2 నుంచి 4 సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గురుకులంలో టీచర్ పోస్టుకు..

అశ్వారావుపేట మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో టీజీటీ ఫిజికల్ సైన్సెస్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తూము సంగీత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీలో ఎంపీసీ, పీజీలో ఫిజిక్స్ లేదా కెమిస్ట్రీతోపాటు బీఎడ్ (ఫిజికల్ సైన్సెస్ మెథడాలజీ) పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3 సాయంత్రం 4గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు సంత వేలంపాట

బూర్గంపాడు: నాగినేనిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.10వేల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. రెండు వ్యాపార దుకాణాలు అద్దెకు ఇచ్చేందుకు కూడా వేలంపాట జరుగుతుందని తెలిపారు.

వ్యవసాయశాఖ సర్వే

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ పథకం అమలులో భాగంగా రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం చినరాయిగూడెం, కూనవరం గ్రామపంచాయతీలోని రైతులను కలుసుకుని ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, పట్టాదారు పాస్ పుస్తకం వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, సహకార బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

రైతువేదికలో సంప్రదించాలి

ములకలపల్లి: రేషన్‌కార్డుల్లో లోపాల కారణంగా రూ.రెండు లక్షల రుణమాఫీ పొందని రైతులు స్థానిక రైతువేదికలో సంప్రదించాలని డివిజన్ వ్యవసాయ సంచాలకుడు రవికుమార్ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కుటుంబ నిర్ధారణ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి అరుణ్‌కుమార్, ఏఈఓలు ఉన్నారు.

సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. ఐటీడీఏ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమసస్యల పరిష్కారానికి పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో తక్షణమే ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్యాసి, సున్నం సుబ్బయ్య, కాకా జోగారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు, సాంబాయిగూడెం, సమితిసింగారం, కమలాపురం, బాపూజీనగర్ గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి నివారణ మందులను పంపిణీ చేశారు. రాంప్రసాద్, ఉమేష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

అశ్వారావుపేట: బీజేపీ సభ్యత్వ నమోదుపై మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ గొట్టుపుల్ల శ్రీనివాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాళం మణికంత, జల్లిపల్లి అరవింద్, కలకోటి కృష్ణ, కాకి రాము, పుష్కర్ కుమార్, చిట్టి శ్రవణ్, శీమకుర్తి సుబ్బారావు, కల్యాణ్, అప్పారావు, చైతన్య, శ్యామ్, పృధ్వి, సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలపై దిశానిర్దేశం

- అధికారులు, పోలీసులకు సహకరించాలని సూచన
- భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో సదస్సు



ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ అన్నారు. పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో శుక్రవారం గణేష్ ఉత్సవ నిర్వాహకులతో పాటు ఇతర మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ మాట్లాడుతూ.. వచ్చే నెల 7 నుంచి జరుగనున్న గణేష్ ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలని, పట్టణ ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. గణేష్ మండప నిర్వాహకులు విగ్రహాలు ఏర్పాటు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలు రోడ్డు మీద ఏర్పాటు చేయకూడదన్నారు. గణేష్ మండపాల సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారులకు తప్పకుండా తెలియచేయాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలని, మండపాల వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. సమావేశంలో భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు, టౌన్ ఎస్సై మధుప్రసాద్, అలింఖాన్, కుంజా ధర్మా, జిందా, సలీం, బెల్లంకొండ గిరి, విశ్వహిందు పరిషత్ నాయకులు, ముస్లిం మైనారటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

భద్రాచలం పట్టణానికి చెందిన రివైర్‌సైడ్ ఆఫ్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చిరువ్యాపారులకు ఏఎస్పీ అంకిత్ కుమార్ చేతుల మీదగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కూనవరం రోడ్డులో అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు రూ.60 వేల రూపాయల విలువ గల తోపుడు బండ్లతో పాటు చార్జబుల్ దీపాలను అందించి రోటరీ చేయూత నివ్వడం అభినందనీయం అన్నారు. ఈ ప్రాంతంలోన్న అన్ని రోటరీ క్లబ్బులు నిరుపేదలకు మరికొన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ రోటరీ గవర్నర్ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి, భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యదర్శి చెరుకుమిల్లి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మన్ రొటేరియన్ ధనకొండ రాఘవయ్య, కార్యదర్శి గంజి సంపత్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులతో గ్రామసభ



గ్రామసభలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు..

దుమ్ముగూడెం: సీతారామసాగర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న బాధిత రైతులతో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. పర్ణశాల గ్రామపంచాయతీ కార్యాలయంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతుల పేర్లను గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామసభలో పర్ణశాల గ్రామంలో 18.19 3/4 గుంటలకు అవార్డు ఎంక్వయిరీ పూర్తి కాగా గ్రామానికి చెందిన 41.36 3/4 కుంటలకు గాను పబ్లిక్ డిమాండ్ అభ్యంతరాలు తీసుకోడానికి గ్రామసభ నిర్వహించారు. సభలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ఐలు లక్ష్మయ్య,కల్లూరి వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే వదిలేది లేదు

కరకగూడెం: చెరువులకు సంబంధించిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని భట్టుపల్లి, కలవలనాగారం, అనంతారం గ్రామాలలో గల చెరువులను పరిశీలించి మాట్లాడారు. కలవలనాగరంలో 83వ సర్వే నంబర్ ఊరకుంట చెరువులో కొంత భాగం కబ్జాకు గురైనట్లు, భట్టుపల్లిలోని మట్లగూడెం చెరువు భూమిలో పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించామన్నారు. అంతే కాకుండా అనంతారం గ్రామ పంచాయతీలోని 26ఎకరాల ఊరచెరువులో సుమారు 10 మంది ఆక్రమణ చేసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే మండలంలోని అన్ని చెరువులను పరిశీలించి ఆక్రమణదారులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హుస్సేన్ సిబ్బంది హరీష్, శేఖర్, కొండల్, నరేష్ పాల్గొన్నారు.



కరకగూడెం: అనంతారంలో చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగ ప్రసాద్

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు

అశ్వారావుపేట: విద్యార్థులు రాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని అశ్వారావుపేట సీఐ టి.కరుణాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన యాంటీ రాగింగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. సాటి విద్యార్థులను తమ సోదర సోదరీమణులుగా భావిస్తే యాంటీ రాగింగ్ అవగాహనలు నిర్వహించాల్సిన పరిస్థితులు రావన్నారు. రాగింగ్‌కు పాలప్పడితే చట్టపరమైన పర్యవసానాలు వివరించారు. డగ్స్, నార్కోటిక్స్, సైబర్ క్రైమ్ చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ శివరామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, డాక్టర్ టి.శ్రావణ్‌కుమార్, డాక్టర్ రెడ్డిప్రియ, డాక్టర్ కే నాగాంజలి, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల సమాచారమివ్వండి

అసాంఘిక శక్తుల సమాచారం అందించాలని ఇస్లాం, క్రిస్టియన్ మత పెద్దలను సీఐ టి.కరుణాకర్ కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే విషయాలు ముందుగా కుల, మత పెద్దల వద్దకు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ విషయాలపై సమాచారం అందించాలని సూచించారు.

సాగు భూమిని అధికారులు ముట్టొద్దు

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం, భీమవరం గ్రామస్తులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూముల జోలికి రెవెన్యూ , ఫారెస్ట్ అధికారులు రాకుండా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు శుక్రవారం ఆదివాసీ రైతులు వినతి పత్రం అందజేశారు.

మారాయిగూడెం, భీమవరం రెండు గ్రామాలకు సంబంధించిన ఆదివాసీ రైతులు 16 మంది వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, పార్టీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్యలు మాట్లాడారు. సర్వే నంబర్ 39/పీలో 16 ఎకరాలు జామాయిల్, పత్తి లాంటి పంటలు వేసి సాగు చేస్తున్న భూములను రెవెన్యూ అధికారులు వచ్చి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు రాసి ఇచ్చామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే స్థానిక తహసిల్దార్‌కి ఫోన్ చేసి ఎన్నో ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న ఈ భూమిని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కి ఏ విధంగా రాసిస్తారని ప్రశ్నించారు. అవసరం అయితే రెవిన్యూ శాఖ మంత్రి తో మాట్లాడి ఆదివాసీల సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు సోంది అర్జున్, సోడి చిన్న వెంకటేష్, సొంది జోగయ్య, రాజు, సరియం చిన్న వీరయ్య, సోడి భద్రయ్య, సోడి పెద్ద వెంకటేష్, రామారావు, కల్లూరి భద్రయ్య, సోందే అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలని ర్యాలీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

మణుగూరురూరల్: కలకత్తాలో వైద్యవిద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మణుగూరు గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. సురక్షాబస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సభ్యులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీస్

చండ్రుగొండ: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో రేపటి నుంచి సమ్మె చేస్తామని ఎంపీడీఓ అశోక్‌కు పంచాయతీ కార్మికులు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఆరునెలల నుంచి వేతనాలు రాక తాము ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రామచంద్రాపురం మీదుగా బస్సులు నడపాలి

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామం మీదుగా మణుగూరు-భద్రాచలం బస్సులు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివిధ పనులకు, ఆస్పత్రులకు భద్రాచలం వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని, ఉదయం ఒక్క సారే బస్సు నడుపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు మరిన్ని సర్వీసులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల కమిటీ ఎన్నిక

చండ్రుగొండ: మండల కేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. 15 మంది మహిళలతో కమిటీని ఎన్నుకున్నారు. మక్కా సుశీల, బి.యశోద, కె.యశోద, మౌనిక, సీహెచ్.సోమలతల తోపాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. పాఠశాల హెచ్ఎం ఎండి.వాజిద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా శుక్రవారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా పలు రకాల పూజా కార్యక్రమాలు చేపట్టి కల్యాణతంతు నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, అర్చకులు మదన్మోహన్‌చార్యులు, శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం మండలంలోని మంగువాయిబడవ గ్రామంలో గత రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి, సర్వం కోల్పోయిన పాడియం సురేష్ కుటుంబానికి 10వ తరగతి స్నేహితులందరూ కలిసి రూ.13వేల 300లను సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పాడియం సురేష్ స్నేహితులు తోట రమేష్, సొందే మల్లుదొర, కోరం మురళి, తునికి. నాగరాజు, పాయం కామేష్, సోయం వీరభద్రం, సోయం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యపై వినతి

చండ్రుగొండ: మండల కేంద్రం చండ్రుగొండలోని బెండాలపాడు రోడ్డుకు ఇరువైపులా నిర్మించనున్న సైడ్ డ్రెయినేజీ వెడల్పుపై శుక్రవారం బాధితులు ఎంపీడీఓ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న స్థితిలోనే డ్రెయినేజీ నిర్మాణం చేయాలని, వెడల్పుచేస్తే తాము ఇళ్లు కోల్పోతామని వాపోయారు. కార్యక్రమంలో బూరుగు సైదులు, పఠాన్ యూసుఫ్‌ఖాన్, ఎస్‌కె.నాగుల్‌మీరా పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

చండ్రుగొండ: మండలంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని తాజా మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండ్రుగొండ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటికే 10 డెంగీ కేసులు ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. సభలో అనేక సమస్యలపై తీర్మానాలు చేశారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, పంచాయతీ సెక్రటరీ జనార్థన్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: ఆరోగ్యవైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. శుక్రవారం మండల పర్యటనలో భాగంగా ఆయన దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది అందరు ఈ రెండు నెలలు జాగ్రత్తగా ఉండాలని, విధులు పట్ల అలసత్వం వహిస్తే తీవ్ర పర్యావసనం ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ వహించాలని మండల అభివృద్ధి అధికారికి ఫోన్‌లో సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బైరెడ్డి సీతారామారావును పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, నాయకులు లంక అబ్బులు, నటరాజ స్వామి, సిరపు అప్పల రెడ్డి పూజారి సూర్య చంద్రరావు, కుంజా శ్రీనివాసరావు, కెల్లా శేఖర్, తెల్లం హరి, తెల్లం భీమరాజు,లంక రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంఘవిద్రోహ శక్తులకు సహకరిస్తే చర్యలు



గొత్తికోయలకు సామగ్రి అందిస్తున్న డీఎస్పీ

గుండాల: సంఘవిద్రోహ శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలం అడవి రామవరం గొత్తికోయ గ్రామాన్ని పోలీసు సిబ్బందితో సందర్శించారు. ఆళ్లపల్లి వైద్యాధికారి రేవంత్, సంఘమిత్ర ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. అడవి రామవరం ప్రజలకు సోలార్ లైట్లు, పండ్లు, బ్రెడ్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అందరూ మంచిగా పని చేసుకొని జీవించాలని, తమకు ఏ సమస్య ఉన్న పోలీస్ వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలను మంచిగా చదివించి ప్రయోజకులను చేయాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వచ్చిన పోలీసు సమాచారం ఇవ్వాలని అన్నారు. సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి రతీష్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్ద ఉన్న జాయింట్ చెక్‌పోస్టులో పోలీసులు రిజిస్టర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అక్రమాలపై గురువారం 'చెక్ పోస్టు వద్ద అక్రమాలు'అంటూ 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ వెంటనే చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది ఎన్ని వాహనాలను తనిఖీ చేశారు అనే సంఖ్యను నమోదు చేసేందుకు గాను ఓ రిజిస్టర్‌ను ఏర్పాటు చేయించారు. ప్రతి రోజు తానే స్వయంగా వచ్చి రిజిస్టర్ తనిఖీ చేస్తానని, ఇందుకు సంబంధించిన పట్టణ సీఐ సంజీవరావు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. చెక్‌పోస్టు వద్ద నిత్యం తనిఖీలు నిర్వహించాలని టౌన్ పోలీసులను ఏఎస్పీ ఆదేశించారు. అదే విధంగా చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.



ఏర్పాటు చేసిన రిజిస్టర్.. అందులో ఏఎస్పీ సంతకం

బేషరతుగా రుణమాఫీ చేయాలి



దమ్మపేట: నిరసన చేపడుతున్న రైతు సంఘం నాయకులు

అశ్వారావుపేట: ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, అశ్వారావుపేట మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు మాట్లాడుతూ.. రుణమాఫీ కోసం రైతులు రైతు వేదికలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంగాల కల్లయ్య, కణితి జోగారావు, కారం రాజులు, సోడెం లక్ష్ముడు, కారం వెంకటేష్, కొమరం పెద్ద గంగరాజు, కంగాల భూలక్ష్మి, జెడ్డి అజితా, జెడ్డి గంగమ్మ, పూనెం శారద తదతరులు పాల్గొన్నారు.

దమ్మపేట: బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హత కలిగిన ప్రతి రైతుకీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, పంట బీమా పథకం, రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అమర్లపూడి రాము, కల్లూరు కిషోర్, వీరబాబు, ముత్యాలరావు పాల్గొన్నారు.

కొండరెడ్ల కుటుంబాలకు మెరుగైన సేవలు



కొండరెడ్డి మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, తదితరులు

అశ్వారావుపేటరూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు అశ్వారావుపేట ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, ఐటీడీఏ డీటీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలకుంట గ్రామంలోని రైతు వేదిక ఆవరణలో కొండరెడ్ల కుటుంబాలకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపు ద్వారా తిరుమలకుం గ్రామానికి చెందిన 59 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, ఆరుగురికి ఆధార్ కార్డులు, 21 మందికి ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు ఖాతాలను తెరిచి అక్కడిక్కడే లబ్దిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జన్‌జాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాల ద్వారా కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలు, ఆయుష్మాన్ భవ కార్డు, పోడు భూములకు పట్టాలు, పీఎం కిసాన్ కార్డు, రేషన్, కుల, ఆదాయ దృవీకరణ పత్రాల అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సీహెచ్ రామకృష్ణ, ఐకేపీ సీసీ నాగబాబు, కార్యదర్శి కార్తీక్, బ్యాంకు మేనేజనర్లు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్పు రద్దు చేయాలని రిలే దీక్షలు

భద్రాచలంటౌన్: సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం పట్టణం అంబేడ్కర్ సెంటర్‌లో వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ మాట్లాడుతూ.. దళితుల ఐక్యత చూసి ఓర్వలేక కొన్ని అగ్రకుల మనువాదులు దళితులను విడదీసేందుకు ఉసుగొల్పుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దేగల వంశీ, శివ, సరేళ్ళ వెంకటేష్, శ్రీను, సందీప్, వెంకన్న, రాఘవులు, రామకృష్ణ, కార్తీక్, సత్తిబాబు, సురేష్, వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.